## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేల: మండల కేంద్రంతో పాటు చప్రాల, సాంగిడి, సిర్సన్న సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. డోప్టాల గ్రామ శివారులోని సాంగిడి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏబీ స్విచ్‌తో పాటు 33 కేవీ లైన్‌లో ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

### పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బోథ్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా బోథ్ మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగులతో ముచ్చటించారు. ఆసుపత్రిని అభివృద్ధి చేస్తామన్నారు.

### సామూహిక లింగాష్టక పారాయణం

బోథ్: సొనాల మండల కేంద్రంలోని శ్రీరాజ రాజేశ్వర మందిరంలో సోమవారం సామూహిక లింగా ష్టక పారాయణం నిర్వహించారు. ఉదయం 7:30 గంటలకు ఏడవ సామూహిక లింగాష్టక పారాయ ణం ప్రారంభమైంది. ప్రతీ సోమవారం ఆలయంలో లింగాష్టక పారాయణం నిర్వహిస్తామని శివాలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మొత్తం 21 వారాలపాటు సామూహిక లింగాష్టక పారాయణం కొనసాగుతుందన్నారు. అర్జున్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### అట్టహాసంగా సొనాల ప్రీమియర్ లీగ్ ప్రారంభం



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: సొనాల మండల కేంద్రంలో తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సొనాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కొద్దిసేపు క్రికెట్ ఆడారు. గ్రామీణ స్థాయిలో పోటీలు నిర్వహిస్తే యువకుల ప్రతిభ వెలికితీయబడుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ఇర్ల అభిలాష్, సుధీర్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

### చదువు పూర్తి కాగానే ఉద్యోగం సాధించాలి

ఆదిలాబాద్‌రూరల్: చదువులు పూర్తి కాగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోని ఉద్యోగం సాధించాలని మోటివేషనల్ స్పీకర్ రోషి రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ డిగ్రీ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే అంశంపై అవగాహన కల్పించారు. యూపీఎస్సీ, సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలు సాధించే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ సల్లా విజయ్ బాబు, బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తాంసి: మండల కేంద్రంలో సోమవారం బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని నాయకులు ప్రారంభించారు. సీనియర్ నాయకుడు ఝెల్మ రజనీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని మండల ప్రధాన కార్యదర్శి వెంకట రమణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల నాయకులు కృష్ణ, నాగారెడ్డి, వినోద్ రెడ్డి, ఉత్తం, లింగన్న, కల్యాణ్ నాయకులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్‌కు ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. సొనాల మండల కేంద్రంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో డీఈవో శ్రీనివాస్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. – సాక్షి, నెట్‌వర్క్



ఆదిలాబాద్‌రూరల్: నినాదాలు చేస్తున్న జోగు రామన్న, నాయకులు



బోథ్: పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



తాంసి: కప్పర్లలో..



నేరడిగొండ: వడూర్‌లో..



తలమడుగు: అంబేడ్కర్ జయంతిలో పాల్గొన్న గ్రామస్తులు



నార్నూర్: భారీ ర్యాలీ నిర్వహిస్తున్న దళిత నాయకులు



ఇంద్రవెల్లి: శోభాయాత్రలో పాల్గొన్న యువత



ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న అధికారులు



గుడిహత్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న మౌనిష్‌రెడ్డి, నాయకులు



సిరికొండ: మండల కేంద్రంలో..



ఆదిలాబాద్‌టౌన్: నివాళులర్పిస్తున్న డీఈవో



కైలాస్‌నగర్: నినాదాలు చేస్తున్న నాయకులు



బజార్‌హత్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



ఆదిలాబాద్‌టౌన్: నివాళులర్పిస్తున్న ప్రిన్స్‌పాల్, లెక్చరర్లు



బేల: పంచశీల జెండా వద్ద ప్రార్థనలు చేస్తున్న నాయకులు



ఆదిలాబాద్: నివాళులర్పిస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు

## కాంగ్రెస్ పాలనలోనే సమన్యాయం

- మాజీ ఎంపీ సోయం బాపురావ్

గుడిహత్నూర్: కాంగ్రెస్ పాలనలోనే ప్రజలకు సమన్యాయం జరుగుతుందని మాజీ ఎంపీ సోయం బాపురావ్ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక బుద్ధవిహార్ ప్రాంగణంలో రూ. 5 లక్షలతో నిర్మించిన షెడ్డును నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌తో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉంది. గత సర్కారు చేసిన అప్పులు తీరుస్తూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తుందన్నారు. అంతకు ముందు ఆయనను బౌద్ధ విహార్ ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆడే శీలా, మల్యాల కరుణాకర్, నాగ్‌నాథ్ అప్పా, కరాడ్ బ్రహ్మానంద్, బుద్దే గోవింద్, మస్కే మాధవ్, అజయ్ పాల్గొన్నారు.



షెడ్డును ప్రారంభిస్తున్న సోయం బాపురావ్

## బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ జయప్రదం చేయాలి

ఖానాపూర్: వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పిలుపునిచ్చారు. పట్టణంతోపాటు మండలంలోని పలుచోట్ల పార్టీ వాల్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను బహిరంగ సభ ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజగంగన్న, గౌరికార్ రాజు, పుప్పాల గజేందర్, చంద్రహాస్, ఏనుగుల రాజేశ్వర్, నసీర్, వెంకటేశ్వర్‌రావు, సుమిత్, షోయబ్, మహేందర్, ప్రశాంత్ రెడ్డి, శేఖర్, వాహబొద్దిన్, మెహరాజ్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాన్సన్‌నాయక్

## ఘనంగా విషు పూజ

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలో గల బేల్లూరి అయ్యప్ప ఆలయంలో సోమవారం తమిళ, కేరళ సాంప్రదాయాన్ని అనుసరిస్తూ సాంప్రదాయబద్ధంగా అయ్యప్ప విషుపూజ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొని పూజలు చేశారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండి ప్రతిఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడిని వేడుకున్నారు. ఆధ్యాత్మికం వైపు అడుగులు వేస్తూ సనాతన హిందూ ధర్మానికి పాటుపడాలన్నారు. బెల్లూరి అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భక్తులు దారట్ల జీవన్, రవీందర్, అనుజుల శ్రీనివాస్, చందా గణేష్, భూశెట్టి మహేందర్, చిలుక మహేశ్ పాల్గొన్నారు.



పూజ కార్యక్రమంలో పాల్గొన్న జోగు రామన్న

## ఇంద్రాదేవి ఆలయంలో సమస్యల తిష్ట

- తాగునీటికి ఇబ్బంది పడుతున్న భక్తులు
- కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్య దైవం, ఇంద్రాదేవి ఆలయంలో సమస్యలు తిష్టవేశాయి. కనీస సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి సౌకర్యం లేక చుట్టూ పక్కల ఇళ్ల నుంచి నీటిని సేకరించాల్సి వస్తుంది. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు, ఎక్కడ స్థలం దొరికితే అక్కడ వంటలు చేసి ఇంద్రాదేవికి నైవేద్యం సమర్పిస్తున్నారు.

**స్థలం లేక అవస్థలు**

ప్రతీ సంవత్సరం పూష్య మాసంలో కేస్లాపూర్ నాగోబా మహా పూజకు ముందు ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులు ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేస్తారు. ప్రతీ సంవత్సరం చైత్రి మాసంలో నెల రోజుల పాటు ఉమ్మడి జిల్లా ఆదివాసీలు, గిరిజనేతరులు ఇంద్రాదేవి ఆలయానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. దీంతో ఆలయం వద్ద ఎప్పుడు చూసినా.. భక్తుల రద్దీ దర్శనమిస్తోంది. ఆదే విధంగా ఆలయంలో సరిపడ స్థలం లేక ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో వంటలు చేసి ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేస్తున్నారు. ఇక్కడ కనీస సౌకర్యాలు లేక పోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యలపై ఇంద్రాదేవి ఆలయ కమిటీ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఇంద్రాదేవి ఆలయం నుంచి ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించడంతో పాటు మండల, జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినా.. ఎవరూ పట్టించుకోలేదని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.



ఎండలోనే వంట చేస్తున్న మహిళలు



నీటి కోసం ఇబ్బంది పడుతున్న భక్తులు

### వసతులు కల్పించాలి



ఆలయంలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నాం. చుట్టూ పక్కల ఇళ్ల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తుంది. స్థలం ఉన్నా.. వ్యవసాయ మార్కెట్ యార్డులో వంటలు చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వసతులు కల్పించాలి.

– చహకటి నాగోరావ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

### ఇబ్బంది పడుతున్నాం



ఇంద్రాదేవి ఆలయంలో కనీస సౌకర్యాలు లేక పూజలకు వచ్చిన భక్తులు ఇబ్బంది పడుతున్నారు. వంటలు చేసేందుకు స్థలం లేక, సరిపడా తాగునీటి సౌకర్యం కూడా లేదు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అధికారులు దృష్టి సారించాలి.

– పెందోర్ యేశ్వంత్‌రావ్, సాకేర

## ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్రూం కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించినందుకు గాను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. తాగునీటి ఎద్దడి విషయమై ఇటీవల కాలనీలో ఎమ్మెల్యే పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు బ్లాక్‌లకు నీరు రావడం లేదని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈవిషయమై బోర్లు వేస్తానని ఇచ్చిన హామీ మేరకు రెండు రోజుల క్రితం నూతన బోర్లను వేయించారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


నేరడిగొండ: పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతగా ఉంటారని ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిలేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం నేరడిగొండ అంగన్‌వాడీ కేంద్రం– 1లో మహిళా, శిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారత ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. గర్భిణులు, కిశోర బాలికలు, బాలింతలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనసూయ, ఆశ వర్కర్లు, మహిళలు, కిషోర బాలికలు, బాలింతలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నిఖిలేశ్వర్ రెడ్డి

## బ్రహ్మయోగా ట్రస్ట్ నిర్మాణానికి భూమిపూజ

బోథ్: సొనాల మండలంలోని గుర్రాలతండా గ్రామ శివారులో రూ. 225 కోట్లతో నిర్మిస్తున్న బ్రహ్మయోగా ఆశ్రమం ట్రస్ట్ నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను చౌహాన్ కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్మాణానికి 10 ఎకరాల భూమిని విరాళంగా అందించిన చౌహాన్ కర్తార్ సింగ్, చౌహాన్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అభినందించారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే